క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



కాటారం: మండలంలోని విలాసాగర్ మానేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ సిబ్బందితో కలిసి విలాసాగర్, గంగారం గ్రామాల మధ్య పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా విలాసాగర్ వద్ద అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో పాటు వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేనట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమాని శేఖర్‌తో పాటు డ్రైవర్ సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



కాటారం: మండల కేంద్రం వైపుగా రేషన్ బియ్యంతో వస్తున్న టాటా ఏసీ వాహనాన్ని బొప్పారం క్రాస్ వద్ద బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ బియ్యం అక్రమంగా సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి బొప్పారం క్రాస్ వద్ద తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో అటు వైపుగా వస్తున్న టాటా ఏసీ వాహనాన్ని నిలిపి పరిశీలించగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనపర్చుకొని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. డ్రైవర్ మంతెన రమేశ్‌తో పాటు బియ్యం సేకరించి తరలిస్తున్న తాళ్లపల్లి సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గుడుంబా..

కాటారం: మండల కేంద్రంలో ఓ మహిళ గుడుంబా విక్రయిస్తుండగా బుధవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు లక్ష్మి ఇంట్లో తనిఖీ చేయగా 5 లీటర్ల గుడుంబా లభించినట్లు పేర్కొన్నారు. గుడుంబా స్వాధీనపర్చుకొని లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా గుడుంబా తయారు చేసిన విక్రయాలకు పాల్పడినా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ఇసుక వేలం

రేగొండ: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ శ్వేత ఆధ్వర్యంలో 18 ట్రాక్టర్ల ఇసుకను వేలం పాట నిర్వహించారు. గత నెలలో మండలంలో వివిధ గ్రామాలలో పట్టుబడిన ఇసుకను అధికారులు సీజ్ చేశారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ఇసుకను వేలం పాట వేయగా మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన గంజి రజినీకాంత్ అనే వ్యక్తి రూ.55,800 లకు దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు

- నిధులు లేక ఆగిన పల్లె దవాఖానా నిర్మాణ పనులు
- పనులు పూర్తయితే గ్రామాల్లో అందుబాటులోకి ప్రభుత్వ వైద్యం



అసంపూర్తిగా ఉన్న టేకుమట్ల పల్లె దవాఖానా భవనం

టేకుమట్ల: పేదలకు వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో గ్రామాల్లో పల్లె దవాఖానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు మండల కేంద్రంలో, వెల్లంపల్లి, వెలిశాల, గర్మిళ్లపల్లి గ్రామాలతో పాటు మండలంలోని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిట్యాల మండలం గిద్దెముత్తారం, చైన్‌పాకపల్లెలో పల్లె దవాఖానాల భవనాలు నిర్మించేందుకు నేషనల్ హెల్త్ మిషన్ నిధుల ద్వారా ఒక్కొక్క భవనాని రూ.20లక్షలను మంజూరు చేశారు. వైద్యులను కూడా నియమించారు. కానీ పూర్తి స్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో దవాఖాన భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కేవలం గిద్దెముత్తారం, వెల్లంపల్లి భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. చైన్‌పాకలో శంకుస్థాపనతోనే ఆగిపోగా గర్మిళ్లపల్లి, టేకుమట్ల, వెలిశాల భవనాలు చివరి దశకు చేరుకున్నాయి. పల్లె దవాఖానాలు పూర్తయి వైద్యులు అందుబాటులోకి వస్తే పల్లెలకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పూర్తి స్థాయిలో నిధులు విడుదలైతే భవన నిర్మాణాలు పూర్తి చేసి వైద్య సేవలను అందించేందుకు సిద్ధం చేస్తామని కాంట్రాక్టర్లు తెలుపుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు లేకనే నిలిపివేశాం..



మండల కేంద్రంతో పాటు, మండలంలోని వెలిశాల, గర్మిళ్లపల్లి పల్లె దవాఖానాలను నిర్మిస్తున్నాను. బిల్లులు రాకపోవడంతో నిర్మాణాలను నిలిపివేశాం. కొంత మేర నిధులు విడుదలైనా పూర్తి స్థాయిలో నిర్మాణాలను పూర్తి చేస్తాం. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేస్తే పల్లె దవాఖానాలను పూర్తి స్థాయిలో నిర్మిస్తాం. అందుకు అధికారులు, పాలకులు స్పందించాలి.

- నరేష్, సబ్ కాంట్రాక్టర్, టేకుమట్ల

అందుబాటులోకి తేవాలి



పల్లె దవాఖానాలను నిర్మిస్తే గ్రామాల్లోనే ప్రజలు వైద్యం చేయించుకుంటారు. టేకుమట్లలో ఉన్న పల్లె దవాఖానాను పూర్తి చేస్తే వెలిశాలకు వెళ్లకుండా వైద్యం చేపించుకుంటాం. వీలైనంత త్వరగా పల్లె దవాఖానాలను పూర్తి చేసి ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తేవాలి.

- వంగ ప్రభాకర్, రాఘవరెడ్డిపేట

బాల్యవివాహాలను అరికట్టాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అనూష

చిట్యాల: బాల్యవివాహాలను అరికట్టాలని మహిళ సాధికారత కేంద్ర సిబ్బంది అనూష, మమత అన్నారు. మండల కేంద్రంలోని సబ్‌సెంటర్‌లో బుధవారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడపిల్లల విద్య, అక్రమ రవాణా, బాల్యవివాహ నిషేధ చట్టం, మొబైల్ వాడడం మూలంగా జరిగే నష్టాల గురించి వివరించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలు ఆపద సమయంలో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఆపద సమయంలో మహిళలు హెల్ప్ లైన్ 181, వృద్ధులు 14567, సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930ను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకౌంట్ అసిస్టెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22న మోడల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్‌తో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థులను ప్రతిభ, సామర్థ్యాలను గుర్తించేందుకు ప్రతీ ఏడాది మోడల్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 21న మండల స్థాయి, 22న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వికాస్, యశ్వంత్, శ్రావణి, అస్త, అఖిల పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

- రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఐత ప్రకాశ్‌రెడ్డి

కాళేశ్వరం: ఉమ్మడి మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి కోరారు. బుధవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఎన్నికల ప్రచారం చేసి అనంతరం హరిత హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి నరేందర్‌రెడ్డి కృషి చేస్తాడని తెలిపారు. మహదేవపూర్ బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, మాజీ ఎంపీటీసీ మమత, నాయకులు అశోక్, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, మధుసూదన్, రామ్మోహన్, లక్ష్మణ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'క్రిమినల్ కేసులు నమోదు చేయాలి'

కాళేశ్వరం: మహదేవపూర్ మండల పరిధి ఇసుక క్వారీల్లో అక్రమ రవాణా చేసిన క్వారీ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్వారీల్లో ఇసుక రవాణాపై ప్రభుత్వం విచారణ జరిపి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేపు ఆయుర్వేద వైద్యశిబిరం

భూపాలపల్లి అర్బన్: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రేపు(శుక్రవారం) ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఏరియా అధి కార ప్రతినిధి మారుతి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఏ రియాలోని కార్మికులు, పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకోవా లని సూచించారు. కృష్ణకాలనీ సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల శిబిరం కొనసాగుతుందన్నారు.

ఆర్థిక సాయం

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన పోలంపల్లి నీలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి బుధవారం పరామర్శించి రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట సాగర సంగం జిల్లా అధ్యక్షుడు దేవునూరి చంద్రమౌళి, కసుకుల ప్రభాకర్, కోశాధికారి సుధాకర్, సదానందం, రాకేష్, రాజు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఇసుక వేలం

రేగొండ: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ శ్వేత ఆధ్వర్యంలో 18 ట్రాక్టర్ల ఇసుకను వేలం పాట నిర్వహించారు. గత నెలలో మండలంలో వివిధ గ్రామాలలో పట్టుబడిన ఇసుకను అధికారులు సీజ్ చేశారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ఇసుకను వేలం పాట వేయగా మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన గంజి రజినీకాంత్ అనే వ్యక్తి రూ.55,800 లకు దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

కోటగుళ్ల అభివృద్ధికి కృషి చేస్తా..

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం: మండల కేంద్రంలోని కోటగుళ్ల అభివృద్ధికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ నెల 26న శివరాత్రి పర్వదినం సందర్భంగా కోటగుళ్లలో నిర్వహించే శివపార్వతుల కల్యాణం వాల్‌పోస్టర్‌ను బుధవారం మండలకేంద్రంలోని కోటగుళ్లలో ఆయన ఆవిష్కరించారు. మొదట ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు నాగరాజు తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటగుళ్లను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపు తనిఖీ



షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ శ్రీజ

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన శ్రీ సాయిరాం ఫర్టిలైజర్ షాపును మండల వ్యవసాయ అధికారి శ్రీజ బుధవారం తనిఖీ చేశారు. ఎరువుల షాపు యజమాని శ్రీనివాస్ తాడిచర్లకు చెందిన మేనం మొగిలి అనే రైతుకు ఇటీవల నిషేధిత గడ్డి మందు ఇవ్వడంతో గడ్డి మందు పిచికారీ కారణంగా పొలం అంతా చనిపోయిందనే సమాచారం మేరకు వరి పొలాన్ని ఏఓ సందర్శించారు. వరి పంటకు పిచికారీ చేసిన గడ్డి మందును ఆమె పరిశీలించారు. అనంతరం శ్రీ సాయిరాం ఫర్టిలైజర్ దుకాణాన్నికి వెళ్లి షాపులోని మందులను, బిల్లు, రికార్డులను, గడ్డి మందులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. షాపులో నిషేధిత గడ్డి మందులు లేవని చెప్పారు. సిఫార్సు చేసిన మోతాదు కంటే ఎక్కువ మోతాదులో గడ్డి మందు పిచికారీ చేయడం వల్ల పంటకి నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు సూచించారు. రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు డీలర్లు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాడిచర్ల క్లస్టర్ ఏఈఓ పృథ్వీరాజ్, రైతులు ఉన్నారు.

కాళేశ్వరంలో ముగిసిన క్రికెట్ టోర్నీ



బహుమతి అందజేస్తున్న ప్రకాశ్‌రెడ్డి, తదితరులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మాజీ ఎంపీటీసీ రేవెల్లి మమత నాగరాజుల ఆధ్వర్యంలో బండెల రాజేశ్వరి స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో బుధవారం ముగిసింది. గెలుపొందిన క్రీడాకారులకు రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. విన్నర్‌గా సన్‌రైజర్స్(కాళేశ్వరం)టీంకు రూ.10,016, రన్నర్స్ కేజీఎఫ్ లెవన్ (కాళేశ్వరం) టీంకు రూ.5,016లకు బహుమతులతో పాటు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, నాయకులు కామిడి శ్రీనివాస్‌రెడ్డి, మెంగాని అశోక్, రాంమోహన్‌రావు, గండెసిరి సత్యనారాయణ, మధుసూదన్, మంగాయి లక్ష్మణ్, ఇమ్రాన్,మనోజ్, శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదు

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్



మాట్లాడుతున్న రవిగౌడ్

టేకుమట్ల: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్‌కి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని విమర్శించే స్థాయి లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ గురించి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురించి తప్పుగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, ఆకునూరి తిరుపతి, తాది రఘు, బొడ్డు సదానందం, పింగిళిమ వెంకటేశ్వర్ రెడ్డి, నిమ్మల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే ఊరుకోం..

- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనిల్



మాట్లాడుతున్న నాయకులు

టేకుమట్ల: కాంగ్రెస్ నాయకులను బీఆర్‌ఎస్ నాయకులు విమర్శిస్తే ఊరుకునేది లేదని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇష్టమొచ్చిన రీతిలో బీఆర్‌ఎస్ నాయకులు వ్యాఖ్యలు చేస్తే పర్లపల్లిలో జరిగిన ఘటన పునరావృతం కాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా నోరు అదులోకి పెట్టుకుని మాట్లాడాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు యశ్వంత్, తిరుపతి, రాజు, క్రాంతి, ధనుష్, పవన్, రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



జగ్గారావు (ఫైల్)

గోవిందరావుపేట: రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పస్రా రాంపూర్‌లో బుధవారం రాత్రి 8 గంటలకు చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మొద్దులగూడెం గ్రామానికి చెందిన మాడ జగ్గారావు (28), పస్రా గ్రామానికి చెందిన పూజారి నర్సయ్య ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో జగ్గారావు తలకి తీవ్రమైన గాయం కావడంతో స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా అంబులెన్స్‌లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

ఏటూరునాగారం: భార్య కాపురానికి రావడం లేదని గడ్డి మందు తాగిన శివ రమేశ్(32) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తాజొద్దీన్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి శివ రమేశ్‌కు సంవత్సరం క్రితం అబ్బాయిగూడెం గ్రామానికి చెందిన రాజేశ్వరీతో వివాహం జరిగింది. శివ రమేశ్ టాటా మ్యాజిక్ నడుపుతుండేవాడు. కాగా, కొంత కాలం నుంచి మద్యానికి బానిసై డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా భార్యతో గొడవపడుతుండడంతో రాజేశ్వరీ మూడు నెల క్రితం పుట్టింటికి వెళ్లింది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన శివరమేశ్ జనవరి 22న వ్యవసాయ భూమి వద్ద గడ్డి మందు తాగి తండ్రి సమ్మయ్యకు ఫోన్ చేసి చనిపోతున్నాను చెప్పాడు. శివ రమేశ్ ఉన్న ప్రాంతానికి వెళ్లి అతడిని ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

గణపురం: ఉద్యోగం చేయడానికి ఆరోగ్యం సహకరించడం లేదని మనస్తాపానికి గురైన సింగరేణి కార్మికుడు గసిగంటి తిరుపతి(27) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతి తల్లి గసిగంటి లక్ష్మి, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఉట్నూరు గ్రామానికి ముత్యాలు సింగరేణి ఉద్యోగానికి మెడికల్ అన్‌ఫిట్ కాగా అతడి చిన్న కుమారుడైన గసిగంటి తిరుపతికి 2019లో డిపెండెంట్ ప్రకారం సింగరేణిలో ఉద్యోగం వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం తిరుపతి బస్వరాజుపల్లి 8 ఇంక్లైన్ గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తూ రామప్ప కాలనీలో నివాసం ఉంటున్నాడని పేర్కొన్నారు. కాగా, కొన్ని రోజులుగా పలుమార్లు ఉద్యోగం చేయడానికి ఆరోగ్యం సహకరించడం లేదని భార్య మౌనికకు చెప్పేవాడన్నారు. ఈ క్రమంలో ఈ నెల 18న (మంగళవారం) రాత్రి భార్య మౌనిక నిద్రించిన తర్వాత బెడ్‌రూంలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని వివరించారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం సమీపంలో కారును ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పాదుమూరుకు చెందిన బేతి సాయికుమార్ మండలంలోని చెరుపల్లికి చెందిన అతడి స్నేహితులు బంటు భానుచందర్, శివ ముగ్గురు స్నేహితులు తిమ్మంపేట క్రాస్ రోడ్డు నుంచి ద్విచక్రవాహనంపై మంగపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును దాటే క్రమంలో మంగపేట వైపు నుంచి వస్తున్న కారును ఢీకొట్టడంతో ముగ్గురికి కాళ్లు విరిగి తీవ్రగాయాలపాలయ్యారు. అక్కడే ఉన్న గ్రామస్తులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా క్షతగాత్రులను ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లినట్లు చేసినట్లు సమాచారం.

పస్రాలో ఇద్దరికి..



క్షతగాత్రుడు అన్వర్

గోవిందరావుపేట: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన పస్రాలోని దయ్యాల వాగు వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళాపురంలోని గుత్తికోయ గూడేనికి చెందిన కోరం సోమ పస్రా నుంచి స్వగ్రామానికి, మేడారం నుంచి హనుమకొండకు మహ్మద్ అన్వర్ ద్విచక్రం వాహనాలపై ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మహ్మద్ అన్వర్ కాలు విరగడంతో స్థానికులు 108 కి సమాచారం ఇవ్వగా అంబులెన్స్‌లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఏటూరునాగారంలో ఒకరికి..



గాయపడిన సురేశ్

ఏటూరునాగారం: మండలంలోని రాంనగర్–కమలాపురం గ్రామాల మధ్యలో ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి పాడిగేదెను ఢీకొట్టి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన కొప్పు సురేశ్ రాంనగర్ గ్రామ సమీపంలో కమలాపురం చెందిన రైతు వద్ద మిర్చి కల్లాలో పనిచేస్తున్నాడు. పని ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న గేదెను ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో స్థానికులు 108లో ఏటూరునాగారం తరలించారు. ఇక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని వరంగల్‌కు తరలించారు.

శివాజీ ఆశయాలను కొనసాగించాలి



రేగొండ: కేక్ కట్ చేస్తున్న ఆరె సంక్షేమ సంఘం నాయకులు

జిల్లా వ్యాప్తంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆరె సంక్షేమ సంఘం, పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగించాలని అన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

- సాక్షి నెట్‌వర్క్



చిట్యాల: శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



కాటారం: నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు



భూపాలపల్లి రూరల్‌లో..



టేకుమట్ల: ఆరెపల్లిలో..

సరోత్తంరెడ్డిని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: బీజేపీ బలపరిచిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు దొంగల రాజేందర్, బట్టు రవి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో సంఘమిత్ర కళాశాలలో ఉపాధ్యాయులను కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊరటి మునిందర్, శంకర్, మాదం మధు, సుధాకర్, గట్ల శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.